# వేలంపాట

"చీకటిని తరిమేస్తుంది... వెల్తురును నింపే స్తుంది....! షాపులో కొంటే ఈ 'టార్చ్' ఖరీదు పాతిక రూపాయలుంటుంది!.... పరీక్షించి చూసుకోండి బాబూ! గేరంటీ సరుకు.... ఉత్సాహంగా పాడుకోండి!.... దేవుడిపాట రెండు రూపాయలు మాత్రమే!"

అప్సరా హోటల్ పక్కన గోడవారగా నిలబడి— అతను వేలం వేస్తున్నాడు. అతని చేతిలో టార్చిలైటుంది.... పక్కనున్న ట్రంకు పెట్టెలో ఇంకా చాలా రకాలు వస్తువులూ బట్టలూ వున్నాయి.

హోటల్లో కాఫీతాగి అప్పుడే బయటకు వచ్చిన వామన్రావ్, వేలంపాట విని, అప్రయత్నంగా అటుపైపు నడిచాడు..... అక్కడ వేలం వేస్తున్న వ్యక్తి చుట్టూ ఓ అరడజనుమంది నిలబడివున్నారు... అందులో ఒకడు ఆ టార్చిలైటు తీసుకుని పరీక్షిస్తున్నాడు.

'నా పాట అయిదు రూపాయలు!'— అన్నాడు దాన్ని తిరిగి ఇచ్చేస్తూ.

'ఆర్రూపాయలు!'— వెంటనే మరొకడు అందుకున్నాడు.

అలా వాళ్ళిద్దరూ ఒకో రూపాయి చొప్పునే పెంచుకుంటూ వేలం పాడుతూంటే— వాళ్ళవైపు చూస్తూ నిలబడిపోయాడు వామన్రావు.

పన్నెండు రూపాయల దగ్గరపాట ఆగిపోయింది.

'ఒకటోసారి పన్నెండు రూపాయలు !... రెండోస్సార్ ... పన్నెండు రూపాయలు... అందరివైపూ చూస్తూ ఆగిపోయాడు వేలం వేస్తున్న వ్యక్తి.

ఇంకెవ్వరూ ఎక్కువధర పలకలేదు.

'చూడండిసార్ ! దీని ఖరీదు పాతిక ;... పన్నెండుకే ఇచ్చేస్తే నాకు పదమూడు నష్టమవుతుంది, అంచేత దీని వేలం కేన్సిల్ చేస్తున్నాను!'— అన్నాడతను.

'పీస్లేడు! పాట ఎంతలో ఆగిపోతే అంతకే ఇచ్చేయాలి!'— అన్నాడు పన్నెండు రూపాయలకు పాడుకున్న వ్యక్తి.

'సరుక్కి గిట్టుబాటుధర పలక్కపోతే- వేలంపాడిన కస్టమర్కి తృణమో పణమో ఇచ్చి- దాని వేలం కేన్సిల్ చేసే హక్కుమాకుం టుంది సార్....'— అంటూనే అతను పర్సులోంచి రెండు రూపాయల నోట్లు రెండు తీశాడు.

'వుంచండి!' అంటూ వేలం పాడిన వ్యక్తి చేతిలో పెట్టాడు.

ఇప్పుడు తన పెట్టెలోంచి ఓ సిల్కు చీర తీశాడు వేలం వేసే వ్యక్తి....

'సూపర్ స్పెషల్ శారీ!.... చైనానించి వచ్చింది సార్.... షాపులో వందకి తక్కువచెబితే నాచెవి కోయించుకుంటాను.... క్వాలిటీ చూసి పాట పాడండి సార్! పది రూపాయల్తో పాట 'బిగిన్' చేస్తు న్నాను.'— ఆ సిల్కు చీర మడతలన్నీ విప్పేసి దాన్ని అందరి మీదకూ విసుర్తూ అన్నాడు.

ముదురు నీలం రంగులోవున్న ఆచీర- ఎర్రటి బోర్డరుతో మెరిసి పోతోంది....

దాన్ని చూడగానే వామన్రావ్ కళ్ళుకూడా మెరిశాయి. ఆ మెరిసే కళ్ళ వెనుక ఆలోచనల్లో శారద కనిపించింది.

'శారద ఈ చీర కట్టుకుంటే చాలా అందంగా వుంటుంది!'— అనుకున్నాడు.

ఆ మాటకొస్తే శారద ఏ చీర కట్టుకున్నా బ్యూటిఫుల్‌గానే వుంటుందని అతనికి తెలుసు. ఆసంగతి ఆర్నెల్ల క్రితం తాను పెళ్ళి చూపులకు వెళ్ళినప్పుడే గ్రహించాడు.

నిజానికి అప్పట్లో– అంటే ఆర్నెల్లక్రితం అతనికి పెళ్ళిచేసుకోవాలనే ఉద్దేశ్యం లేనేలేదు. 'ఉద్యోగం లేనివాడికి పెళ్ళేమిటి?' అనుకున్నాడు. అమ్మపోరు పడలేక పెళ్ళిచూపులకు వెళ్ళేడు.... పిల్ల నచ్చ లేదని చెప్పేస్తే గొడవ వదిలిపోతుందనుకున్నాడు.

తీరా పెళ్ళి చూపులకు వెళ్ళిం తర్వాత- తనముందుకు శారదను తీసుకొచ్చి కూర్చోబెట్టిం తర్వాత- సర్వం మర్చిపోయాడు.....

అప్పుడు శారద 'అతి సామాన్య మామూలు' చీర కట్టుకుంది.... మెడలో నగలులేవు. జడలో పూలు లేవు. అయినా పసిడి ఛాయతో ఆమె అప్సరసలా కనిపించింది. ఆకళ్ళల్లో కొంటెతనం.... బుగ్గల్లో సిగ్గుదనం.... చూపుల్లో చురుకుదనం.... నడుంలో సన్నదనం.... 'ఎట్‌సెట్రా- ఎట్‌సెట్రా'లన్నీ కలసి తన ఉద్దేశ్యాన్ని తారుమారు చేశాయి.

అర్జంటుగా ఆమెనచ్చిందని చెప్పకపోతే- వాళ్ళు వేరే సంబంధానికి పోవచ్చునన్న భయంతో అప్పటికప్పుడే, అక్కడే తన అభిప్రాయాన్ని చెప్పేశాడు వామన్రావ్.

ఆవిధంగా శారద తన అర్ధాంగయింది.... పెళ్ళయి నెలరోజులు కూడా తిరక్కుండానే- వామన్రావ్‌కి రాజమండ్రిలో ఉద్యోగం వచ్చేసింది

'పెళ్ళాం వచ్చిన వేళా విశేషం!'– అన్నారందరూ.... అమాటని అక్షరాలానమ్మేసినవామన్రావ్‌కిఅర్ధాంగిశారదపట్లప్రేమాభిమానాలుపేప్రేగి

పోయాయి. ఉద్యోగంలో చేరిన నెలరోజులకే, ఆర్యాపురంలో ఓ చిన్నవాటా అద్దెకు తీసుకుని కాపురం పెట్టేశాడు. పువ్వులతో ఆమెను పూజించలేకపోయినా— ప్రతిరోజూ పువ్వులుకొని తెస్తున్నాడు.

'ముప్ఫయ్ రూపాయలు.. ఒకటోసార్.... ముప్ఫయ్‌రూపాయలు రెండోసార్....' వేలం వేస్తున్న వ్యక్తి బిగ్గరగా అరుస్తోంటే ఆలోచనల్లోంచి తేరుకున్నాడు వామన్రావు.

'ఆలోచించకండి సార్.... వందరూపాయలు ఖరీదుచేసేచీర!... ఉత్సాహంగా పాడండి!'— హెచ్చరిస్తున్నాడు అతను.

వామన్రావ్ తలపుల్లో శారదరూపమే నిండిపోయిందేమో- బోర్న వీటా తాగినంత ఉత్సాహం వచ్చింది.

'నలభై రూపాయలు!' అన్నాడు అదే ఉత్సాహంతో.

చుట్టూవున్న మనుషులు ఒక్కసారిగా తనవైపు చూసేసరికి— కించిత్ గర్వం కూడా కలిగింది వామన్రావ్‌కి.

'వెరీగుడ్!.... ఈ సార్‌కి సరుకు విలువ తెలుసుకనుకనే— నలభై పెట్టారు.... అయినా నాకు నష్టమే!... ఎవరైనా పైపాట పాడుకోవచ్చు.... వందరూపాయల చీర నలభై రూపాయలు'— మళ్ళీ ఆచీరను చుట్టూవున్న వాళ్ళమొహాలమీదకు ఝుళిపించాడు.

వామన్రావ్‌కి కొంచెం అధైర్యం కలిగింది. 'వేలం వేస్తున్న వ్యక్తి అక్కడివాళ్ళను మరీ రెచ్చగొడుతున్నాడేమో' అనిపించింది.

'ఏమైనాసరే.... బేరం విడిచి పెట్టకూడదు.... శారద ఈ చీర కట్టుకుంటే ఎంత బాగుంటుందనీ?... అసలు తనకు నీలంరంగు చాలా

ఇష్టమని మొదటిరాత్రే చెప్పింది... ఇప్పుడీ చీర కొని పట్టుకెడితే తమ కొత్త కాపురంలో— ఇది తన భార్యకు ఇచ్చే తొలి కానుకే అవుతుంది.' అనుకున్నాడు వామన్రావు.

'హే భగవాన్... ఇంకెవరూ పాట పెంచకుండా చూడు తండ్రీ' మనసులోనే దేవుణ్ణి ప్రార్థించుకున్నాడు.... డబ్బుతీసి ఇచ్చేందుకు రెడీగా జేబులో చెయ్యి కూడా పెట్టేసుకున్నాడు.

'ఒకటోసారి నలభై రూపాయలు.... రెండోసార్సి నలభై రూపా యలు... మూడోస్సార్...'— ఇంకా పూర్తి చేయలేదు.

సరిగ్గా అప్పుడే 'ఏభై'— అన్నారెవరో

వామనరావుకి ఏడుపురాలేదు... కోపం వచ్చింది- దానికి సాయం పౌరుషం కూడా వచ్చేసింది... 'ఏభై' అన్నది ఎవరా అని చూశాడు.

ఇందాకా టార్చిలైటు పన్నెండుకి పాడి- నాలుగు రూపాయలు జేబులో వేసుకున్నాడు-వాడే !

'వేలంవేసే మనిషి తనకు నష్టం వస్తుందని- మళ్ళీ పదోపరకో చేతిలో పెడతాడని ఆశపడుతున్నాడు కాబోలు !' అనుకుంటూ వాడివైపు చూసి పళ్ళుకొరుక్కున్నాడు వామన్రావ్.

వాడు గర్వంగా చూసి- ఓసారి కాలరు సర్దుకుని- జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించుకున్నాడు.

'చాల్లే.... తగ్గరా... బోడి గొప్పానువ్వూనూ!... ఇంత అంద మైన చీర కొనుక్కుని వెళ్ళగానే సరిపోదు ఇంటిదగ్గర అందమైన పెళ్ళాం కూడా వుండాలి దాన్ని కట్టుకునేందుకు!... నీ కోతి మొహాని అందమైన పెళ్లాం ఎలాగా దొరికుండదు!'— కసిగా తిట్టుకున్నాడు, వామన్రావ్.

వేలం వేసే వ్యక్తి అరుస్తున్నాడు.

'ఓ బాబు పాట ఏభై రూపాయలు!... ఆలస్యం చేయకండిసార్. ఇంకా మంచి మంచి అయిటమ్స్ చాలా వున్నాయి. చూపిస్తాను!... త్వరగా పాడండి! అప్సరసలుకట్టే అందమైన సిల్కుచీర.... యాభై రూపాయలు!'—

'అరవై!'— అనేశాడు వామన్రావ్.

'మరో దొరబాబు పాట అరవై!.. వందరూపాయల చీర అరవై!... పాడుకోండిసార్!'

వే. వే. వ్యక్తి అరుస్తుంటే అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అంతకు ముందు యాభైకి పాడిన వ్యక్తి జేబులోంచి డబ్బు బయటకు తీసి లెఖ్ఖ పెట్టుకున్నాడు.

'సారీ! నా దగ్గర యాభయ్యే వున్నాయి!'- అన్నాడు తానింక పైపాట పాడలేనట్టుగా,

'ఇక పాటెందుకూ?.... చూడబోతే ఈ శారీమీద మీరు మోజు పడుతున్నట్టున్నారు...మీరే తీసుకోండి సార్... అదృష్టవంతులు వందరూపాయలు పెట్టినా దొరకని 'శారీ' అరవైకే పట్టుకు పోతున్నారు మడతపెట్టి కవర్లో కూడా పెట్టి వామన్రావ్‌కి అందిస్తూ అన్నాడు వే.వే. వ్యక్తి.

అరవై రూపాయలూ ఇచ్చేసి కవరు అందుకున్నాడు వామన్రావ్.

* * *

'ఎంతపెట్టికొన్నారు?'— చీర మడతలు విప్పి చూస్తూ అడిగింది శారద.

'వంద!' రియాక్షన్ ఎలా వుంటుందో చూద్దామనుకున్న వామ న్రావ్ అసలు ధరకు మరో నలభై కలిపి చెప్పాడు.

ఆశ్చర్యంగా చూసింది శారద భర్తవైపు.

'ఏం... అంత ఖరీదుండదా ?'— ఆత్రంగా అడిగాడు,

'అందుకని కాదు... మా ఆడవాళ్ళని వ్యాపారస్తులు ఎలా మోసం చేస్తారో తల్చుకుంటే ఆశ్చర్యంవేసింది'— చెప్పిందామె.

'అంటే ?'

'మన పక్కింటి పాపాయమ్మలేదూ ? సరిగ్గా ఇలాంటి చీరే నూటయాభై పెట్టి కొనుక్కొచ్చిందిమొన్న !... ఆకొట్టువాడు ఆవిడకి యాభై రూపాయలు టోపీ వేశాడన్నమాట !'— తన భర్త తెలివిగా వ్యవహరించి తక్కువ ధరకు చీర తెచ్చాడనే ఆనందంతో పొంగి పోయిందామె.

ఆపొంగి పొరలే ఆనందాన్ని మర్నాడు పొద్దున్న- భర్త ఆఫీసుకి వెళ్ళగానే— పాపాయమ్మగారితో పంచుకోవాలని- చీరతోసహా వాళ్ళింటికి వెళ్లింది.

ఇద్దరూ తమచీరల్ని పక్కపక్కనే పెట్టి చూసుకున్నారు. దాదాపు రెండూ ఒక్కలాగానే కనిపించాయి.

'ఏమోనమ్మా !... ఈబట్టల్లో కూడా రకాలు చాలా వుంటాయి. అయిదు వందల చీరా, యాభై రూపాయల చీరా ఒక్కలాగ్గా వుంటాయి. నమ్మటానికి వీల్లేదు !'— శారదకంటే వయసులో ఓ పదేళ్ళు పెద్దయిన

పాపాయమ్మ- అప్పటికి ఆరంగంలో తాను సంపాదించిన అనుభవంతో చెప్పింది.

'అయితే- కొంపదీసి మా ఆయనే టోపీలో పడలేదుకదా ?'— అనుకుంది శారద ఆక్షణాన.

'చెప్పలేం... ఆషాపువాడు మాకెప్పుడూ బట్టలు ఇస్తూనే వుంటాడు... సాయంత్రం వెళ్లి రెండు చీరలూ చూపించి ధరలో ఇంత తేడా ఎందుకు వచ్చిందో అడిగేద్దాం !'— చెప్పింది పాపాయమ్మ.

'సాయంత్రందాకా ఎందుకూ ? ఇప్పుడే వెడదాం !'— శారద తొందర చేసింది.

మరో అరగంట సేపట్లో- ఇద్దరూ ఆబట్టలకొట్టుకి వెళ్ళారు. విషయమంతా విన్న షాపు యజమాని చెయ్యి నోటికి అడ్డంపెట్టుకుని మరీ నవ్వేశాడు...

ఎందుకలా నవ్వుతున్నాడో అర్ధంకాక, పాపాయమ్మ, శారదా ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

అలా ఆయాసం వచ్చేసేదాకా నవ్వేసి అసలు సంగతి చెప్పాడు షాపు యజమాని-

'ఇది డూప్లికేటు వెరైటీ ! ముప్పయ్ రూపాయలకంటే ఎక్కువ వుండదమ్మా !'

శారద షాకయింది...

'అందరూ అలాగే చెప్తారు లెండి ! మీ కొట్లోకొంటేనేమో మంచిది... మరోచోట కొంటే చెత్తది !... అంతేగా ?' పౌరుషంగా అంది- తన భర్త తెలివి తేటలమీద అపారమైన నమ్మకంతో....

'మీరెక్కడ కొంటే మాకేమిటమ్మా?... ఉన్నమాట చెప్పాం.. కావాలంటే ఓ 'వాష్' అయ్యాక చూడండి! దాని రంగంతా పోయి— మూడు గజాలకి ముడుచుకుపోతుంది!'

'వాష్ చేసిన తర్వాత కూడా ఇలాగే వుంటే?' కోపంతో సవాలు చేసింది శారద....

ఈ బట్టలకొట్టు మీపేర రాసేసి నేను ముష్టెత్తుకు బతుకుతాను!'- షాపు యజమాని కూడా ఛాలెంజ్ చేశాడు.

అతనలా మాట్లాడటం చాలా అవమానమనిపించింది శారదకి... వెంటనే ఇంటికొచ్చేసి పాపాయమ్మ సమక్షంలోనే ఆచీరను నీళ్ళల్లో తడిపింది... ఓ గంట ఎండలో ఆరేసిన తర్వాత చూస్తే- బట్టకూడా కుంచించుకుపోయింది.

'అయినా వేలం వాళ్ళదగ్గర ఏమీకొనకూడదమ్మా.... పూర్వం ఇలాగే ఓసారి....

ఆవిడ ఏమిటేమిటో చెప్పేస్తోంది—

శారదకు ఒక్కమాట కూడా వినిపించంటలేదు— ఆలోచిస్తూ వుండిపోయింది.

సాయంత్రం ఆరుగంటలవేళ వామన్రావ్ ఆఫీసునించి ఇంటికి వచ్చాడు— కొత్తచీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని కాఫీకప్పుతో ప్రత్యక్షమవుతుందనుకున్న శారద జడకూడా అల్లుకోకుండా- చాలా డల్‌గా కనిపించేసరికి వామన్రావ్ అల్లాడిపోయాడు.

'పదిరోజుల క్రితమేగా స్నానమయిందీ?'– అన్నాడు అనుమానంగా చూస్తూ.

'అంటే—? చిరాకుపడింది శారద.

'మరేంలేదు, మాసిన చీరతో అలా జడకూడా అల్లుకోకుండా 'డల్'గా కనిపించేసరికి- మనసేదో కీడు శంకించీ—' వేళాకోళంగా అన్నాడు.

'పాడు మాటలు మాట్లాడకండి! నాకసలే బాధగావుంది!'– ముఖం మరోవైపు తిప్పుకుంటూ చెప్పింది శారద.

'దేనికోయ్ బాధ?'– ఆమెను దగ్గరకులాక్కుంటూ లాలనగా అడిగాడు.

'మీరు మోసపోయినందుకు!'

అర్ధంకాలేదు వామనరావుకి.

'ఆ వేలంపాట గాడెవడో మీకళ్ళల్లో దుమ్ముకొట్టాడు!'– అంటూ గబగబా వెళ్ళి చీర తెచ్చి చూపించింది... జరిగిన విషయమంతా వివరించింది...

ముడుచుకుపోయి, 'అసలు రంగేమిటో' అర్ధంకాకుండా మారిపోయిన ఆచీరను చూసేసరికి అంతక్రితంరోజు జరిగిన వేలంపాట సీనంతా 'ఫ్లాష్‌బాక్'లా కళ్ళముందు కదిలింది వామన్రావ్‌కి.

'ఎంత మోసం చేశాడు!'– అనుకున్నాడు.

అతనిలోని యువరక్తం ఉడికిపోయి కళ్ళల్లోకి చిమ్ముకొచ్చింది. నరాల్లోవున్న శక్తియావత్తూ పిడికిళ్ళకు చేరుకుంది.

'ముప్ఫయ్ రూపాయల చీర చూపించి- వంద రూపాయలని చెప్తాడా ?.... అక్కడికి తనకేదో తక్కువధరకు ఇస్తున్నట్టు— అరవై రూపాయలు వసూలు చేశాడు.... ఎంత మోసం ?'— అని మనసులోనే అనుకున్నాడు.

'ఇప్పుడే వెళ్ళి దీన్ని వాడి మొహానకొట్టి నా డబ్బు నాకు తిరిగి ఇమ్మంటాను'— అన్నాడు ఆచీరను కాగితంలో చుట్టబెట్టి.

'అక్కడ వాడు వుండద్దూ ?'

'నిన్న ఉన్నవాడు ఇవాళ ఉండడా ?.... చూస్తాను. లేకపోతే అక్కడి వాళ్ళకు తెలుసునేమో అడుగుతాను.... మర్యాదగా చీర తీసుకుని డబ్బు తిరిగి ఇస్తాడా సరేసరి.... లేకపోతే నాలుగు ఉతికి, పోలీసులకు అప్పగిస్తాను...' అంటూ ఆవేశంగా నడిచాడు వామన్రావ్.

పదినిమిషాల్లో అతను అప్సరా హోటల్ చేరుకున్నాడు... అంతకుముందు రోజున, వేలంపాట వేసిన వ్యక్తి ఆపరిసర ప్రాంతాలో ఎక్కడా కనిపించలేదు. పక్కనేవున్న కిళ్ళీకొట్టులో వాకబు చేసాడు...

'అతను రోజూ రాడు సార్ ! అయినా రోడ్డుమీద వ్యాపారం చేసేవాడికి రోజూ ఒకే చోటని ఏముంది ?'— చాలా తేలిగ్గా చెప్పాడు కిళ్ళీకొట్టు మనిషి.

వామనరావ్ నిరాశగా వెనక్కితిరిగాడు... వృధాగా అరవైరూపాయలు పోయాయన్న బెంగలో ఆరాత్రి అన్నంకూడా తినాలనిపించ లేదు అతనికి....

సినీమా ఆరోజే రిలీజయిందేమో- థియేటర్ దగ్గర బాగా జనం వున్నారు... వామన్రావ్ అక్కడకు వచ్చేసరికి అన్ని బుకింగుల దగ్గరా కొల్లేటి చాంతాడల్లే 'క్యూ'లు కనిపించాయి... క్యూలో వెళ్ళినిలబడితే టిక్కట్టు దొరుకుతుందనే గేరంటీలేదు....

ఏం చేయాలో తోచలేదు వామన్రావ్‌కి... అటూ ఇటూ చూశాడు అప్రయత్నంగా అతని చూపులు ఓ వ్యక్తిపై నిలిచిపోయాయి.

అతన్ని సులువుగానే గుర్తుపట్టాడు వామన్రావ్.... ఇరవైరోజుల క్రితం వేలంపాటలో చీరను యాభైరూపాయలకు పాడింది అతనే.... గబగబా అతని దగ్గరకు నడిచాడు.

'మూడు రూపాయల టిక్కట్టు అయిదు రూపాయలు! రెండే వున్నాయ్.... కావాలాసార్ ?'— వామన్రావుని చూస్తూనే అడిగాడతను.

కానీ వామన్రావ్ సినీమా విషయం పూర్తిగా మర్చిపోయాడు.

'నేను గుర్తున్నానా ?'— సీరియస్‌గా అడిగాడు.

అతను— గుర్తురాలేదన్నట్టుగా మొహం పెట్టేడు.

'ఆరోజు అప్సరా హోటల్ దగ్గర వేలంపాటలో...'— వామన్రావ్ ఆమాత్రం అందించేసరికి— అతనికి జ్ఞాపకం వచ్చేసింది.

'ఆ.... ఆ.... ఇప్పుడు గుర్తొచ్చింది సార్.... ఆరోజు వేలం పాటలో మీరు చీరకొన్నారుగా ?'— ఉత్సాహంగా అన్నాడు.

'అవును! ఆవేలంపాటగాడికోసం మళ్ళీ చాలాసార్లు అప్సరా హోటల్ దగ్గరకు వెళ్ళాను.... కనిపించలేదు.... వాడి ఎడ్రస్ కావాలి!' అడిగాడు వామన్రావు.

'ఎందుకుసార్ ?'

'మాయచేసి అరవై రూపాయలు కొట్టేశాడు. వాడిచ్చిన చీర ఎందుకూ పనికిరానిది.... వాడెక్కడ వుంటాడో చెప్తే— పోలీసులకు పట్టిస్తాను!'

'వాడెవడో నాకూ తెలీదుసార్! ఆరోజు సాయంత్రం అక్కడి పార్కులో బెంచీ మీదపడుకుని నిద్రపోతూంటే వాడొచ్చిలేపాడు... తను వేలం వేసే వస్తువుల్ని ఎవరైనా పాడితే దానికంటే అయిదో, పదో ఎక్కువకి నన్ను పాడమన్నాడు. అలాపాడితే ఆ వస్తువు రేటు ఎక్కువ పలుకుతుందనీ, నిజంగా దాన్ని కొనదల్చుకున్నవారికి నమ్మకం కుదురుతుందనీ చెప్పాడు.... నాకు 'టెన్ పెర్సెంట్' కమీషన్ ఇస్తానన్నాడుసార్!'—

అసలు విషయం బోధపడింది వామన్రావ్‌కి.

'అంటే ఆరోజు నువ్ చీర— నిజంగా కావాలని పాడలేదన్న మాట!' అడిగాడు ఆవేశంగా...

'లేదుసార్!.... బ్రహ్మచారిగాణ్ణి.... చీరలూ, సారెలూ నాకెందుకూ ?... కేవలం పట్టుదలతో మీరు దానికి మరింత ఎక్కువ పెట్టి కొంటారనీ....'

'ఒకవేళ నేను ఎక్కువ పెట్టి వుండకపోతే?'— కోపంగా అడిగాడు.

'ఏముందీ ?... బ్యాట్రీలైటుకి నాలుగు రూపాయలిచ్చినట్టే— ఆ చీరకూ్కడా పదో, పరకో 'గుడ్‌విల్' ఇచ్చేవాడు. తర్వాత వాడి డబ్బు మళ్ళీ వాడికే ఇచ్చేయమన్నాడ్లెండి!...

'ఎంతమోసం ?'– పళ్ళుకొరుక్కున్నాడు వామన్రావు.

'కోటి విద్యలూ కూటి కోసమే కదసార్!...' అంటూ అతను మరోవైపు వెళ్ళిపోయాడు.

వామన్రావు కళ్ళు ఎర్రబడ్డాయి.... అతనిలోవున్న రక్తం ఉడికిపోయి కళ్ళల్లోకి చిమ్ముకొచ్చింది. నరాల్లోవున్న శక్తి యావత్తూ పిడికిళ్ళకు చేరుకుంది. కాలి దగ్గరున్న రాయిని బలంగా తన్నేసి రోడ్డుమీదకు నడిచాడు....

* * *

పోస్టులోవచ్చిన ఇన్‌లాండుకవరు చదువుకుని పొంగిపోయాడు వామన్రావు....

'ఏమేవ్!' అంటూ వంట గదిలోకి కేకపెట్టాడు హుషారుగా.

'ఏమిటీ.... ఎందుకలా అరుస్తారు ?'....వంటగదిలోంచి హాల్లోకి వచ్చిన శారద భర్త పక్కనేవున్న కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

'పెళ్ళివారు ఉత్తరం రాశారోయ్.... మన అమ్మాయి వాళ్ళకి నచ్చిందట'

'నిజంగా ?' నమ్మలేనంతగా ఆశ్చర్యపోయింది శారద....దాన్ని ఆశ్చర్యం అనటంకంటే ఆనందమంటేనే సబబుగా వుంటుంది.

'మన పరిమళ అదృష్టవంతురాలు!'- అంది తృప్తిగా కళ్ళల్లో ఆనంద భాష్పాలు నిలుస్తూండగా.

'తొందరగావస్తే తక్కిన విషయాలన్నీ మాట్లాడుకుని ముహూర్తాలు పెట్టుకోవచ్చునని రాశారు సీతారామయ్యగారు!'- వామన్రావ్ చెప్పాడు ఆ కవరు మళ్ళీ మరోసారి గబగబా చదివి.

'మరింకనేం ?... రేపే బయల్దేరి వెళ్లండి!'

'రేపే అంటే ఎట్లా ?... మనం ఎప్పుడు వచ్చేదీ తెలియపరుస్తూ ముందుగా ఓ వుత్తరం రాయమన్నాడు మనల్ని... ఆవేళకి వాళ్ళ బంధువుల్నీ-ముహూర్తంపెట్టే పంతులుగార్నీ పిలుస్తాడుట....వచ్చే సోమవారం అన్ని విధాలా బావుంది....ఆరోజు వస్తానని ఉత్తరం రాస్తాను!'— అన్నాడు కవరుమడిచి జేబులోపెట్టుకుంటూ.

'ఏమైనాసరే... ఈ సంబంధం దాటిపోకుండా చూడండి!.... ఎలాగా పాతికవేలు ఇవ్వటానికి సిద్ధపడివున్నాం. ఇంకో అయిదూ, పదీ అడిగినా ఖాయం చేసుకురండి... అబ్బాయి డాక్టరుకూడానూ!'— శారదకళ్లు ఆశగా మెరిశాయి.

* * *

సోమవారం సాయంత్రం నాలుగ్గంటలవుతున్న సమయంలో బస్సుదిగి రిక్షాలో సీతారామయ్య ఇంటికి చేరుకున్నాడు వామన్రావు. హాల్లోనే కూర్చున్న సీతారామయ్య అతన్ని సాదరంగా ఆహ్వానించాడు.

పలకరింపులు పూర్తయిన తర్వాత పలహారాలు తెప్పించాడు సీతారామయ్య. కతికితే అతకదనే సామెత గుర్తుకొచ్చికాబోలు పలహారం పక్కన పెట్టి కాఫీతో సరిపెట్టుకున్నాడు వామన్రావు.

'వీరు శ్యామలరావుగారు!.... అమలాపురంనించి వచ్చారు...'— ఆ పక్కనేవున్న మరో సోఫాలో కూర్చొనివున్న పెద్దమనిషిని వామన్రావ్‌కి పరిచయం చేశాడు సీతారామయ్య కాఫీ తాగటం పూర్తయ్యాక.

వామన్రావ్ ఆయనకు నమస్కరించేడు.

సీతారామయ్య వెంటనే చెప్పటం ప్రారంభించాడు.

'శ్యామలరావుగారికి ఒక్కత్తే అమ్మాయట! మొన్ననే బి. ఏ. పాసయింది. యింతకీ చెప్పొచ్చేదేమిటంటే వారమ్మాయిని మా అబ్బాయి కివ్వాలని అనుకుంటున్నారట... ఏకంగా ఫోటోకూడా తీసుకొచ్చారు. చూడండి!'- అంటూనే టీపాయ్ మీదవున్న ఓ ఫోటో తీసి వామన్రావ్‌కి అందించాడు.

ఆయనవైపు ఆయోమయాంగా చూస్తూ అప్రయత్నంగా ఫోటో అందుకున్నాడు. దిగులు కళ్ళతో - ఆ ఫొటోలోకి చూశాడు.... తన కూతురు పరిమళకంటే, ఫొటోలో పిల్ల ఓ పిసరు అందంగావున్నట్టే అనిపించింది... చదువు కూడా ఎక్కువే...

ఏం మాట్లాడాలో తోచలేదు వామన్రావ్‌కి... అయినా పరిమళ నచ్చిందని రాసిన పెద్దమనిషి యిప్పుడు మళ్ళీ మరో పిల్ల ఫొటో మాత్రం ఎందుకు చూడాలి?... 'అసలు విషయాన్ని ఆ పెద్దమనిషికి చెప్పేయచ్చుగా!

'ఎట్లావుందంటారుపిల్ల?' - అడిగాడు సీతారామయ్య

'ఫొటోచూసి ఏం చెప్పగలంలెండి?' నీళ్ళునమిలాడు వామన్రావు.

ఆమాటవినగానే - శ్యామలరావు సోఫాలో అసహనంగా కదిలాడు

'అందుకే సీతారామయ్యగార్నీ - అబ్బాయినీ ఒక్కసారి అమలాపురం వచ్చి మా అమ్మాయిని చూసుకోమంటున్నాను!'- అన్నాడు.

'ఎట్లా కుదురుతుంగండీ?... ఓ వారంరోజులు ముందుగానైనా రాకపోతిరి!... తీరా 'వీరి పిల్ల నచ్చిందనీ తక్కిన విషయాలు మాట్లాడు కుందాం రమ్మనీ-నేను ఉత్తరం రాశాను... అందుకే యిప్పుడు వీరు వచ్చారు!'- అసహనంగానే చెప్పాడు సీతారామయ్య.

'నిజమేననుకోండి.... అయినా పీటలమీద పెళ్ళిళ్లే ఆగిపోతున్న ఈ రోజుల్లో మాటల దగ్గరే ఆగిపోయినంతమాత్రాన తప్పేముంటుంది చెప్పండి ? పిల్ల నచ్చిందన్నారుకానీ ఖాయ పరచుకోలేదుగా? ఒక ఆడ పిల్ల తండ్రిగా నా తొందరనాది.... నా ఆశనాది!... అందుకే ఒక్క సారి అమలాపురంవచ్చి అమ్మాయిని చూసుకోండి... నచ్చిందంటే చెప్పండి.... ఏభై వేలు కట్నం యిస్తాను.... మీరడిగే లాంఛనాలు కూడా జరిపిస్తాను...చెప్పానుగా...ఒక్కత్తే పిల్ల... మా తదనంతరం ఆస్తి యావత్తూ అమ్మాయిదే!'

శ్యామలరావు ఆత్రంగా అలా చెప్తూంటే-వామన్రావ్‌కి ముచ్చెమ టలూ పోశాయి....కొంపదీసి సీతారామయ్య ఒప్పుకుంటాడేమోనన్న భయంకూడా అతని ఆలోచనల్లో చొరబడింది.

సీతారామయ్య చెప్పే సమాధానం కోసం ఎదురుచూశాడు.

రెండు నిముషాల మౌనం తర్వాత నోరు విప్పాడు సీతారామయ్య-

'చూడండి శ్యామలరావుగారూ! ఓ పిల్ల నచ్చిందని అనుకున్నాక- మరో పిల్లను చూడాలనుకోవటం ధర్మంకాదు. వామన్రావ్‌గారి అమ్మాయి కంటేమీ పిల్ల అందంగా వుండచ్చుగాక....చదువుకూడా ఎక్కువే కావచ్చు గాక. అయినా అందానికి హద్దెక్కడ చెప్పండి? యిక కట్నం కానుక లంటారా? ఆ విషయంలో వామన్రావుగారు తక్కువ చేస్తారని నేనను కోను!... మీకు వున్నట్టు కొబ్బరితోట - వారికి లేకపోతే లేకపోవచ్చు!

కానీ యింటల్లుడిగా వచ్చే డాక్టరు కుర్రాడికి ఓ యాభై వేలు కట్నం యిచ్చుకోలేని అసమర్థులు మాత్రం కారు!.... అయినా డబ్బు నచ్చటం ముఖ్యం కాదండీ!... మాట ముఖ్యం... పిల్ల నచ్చిందని వారికి నేను మాట యిచ్చాను...కనక మీరు నన్ను మన్నించి వెళ్ళిరండి!' అంటూ చేతులు జోడించాడు.

'సరే మీ ఇష్టం... ఒకవేళ కట్నం, కానుకల విషయంలో వామనరావ్‌గారు ఓ అడుగు వెనక్కి వేస్తే– అప్పుడైనా మాకు అవకాశం ఇప్పించండి!' అంటూ సీతారామయ్య దగ్గర శలవు తీసుకున్నాడు శ్యామలరావు.

వామనరావు తృప్తిగా నిట్టూర్చాడు!!

* * *

'నమస్తేసార్!'– అంటూనే ధరఖాస్తును ఆఫీసరుగారి ముందు పెట్టాడు వామన్రావ్.

'ఏమిటయ్యా ఇది?'– దాన్ని తీసుకుని చూస్తూ అడిగాడాయన.

'లోన్ అప్లికేషన్ సార్! నా ప్రావిడెంటుఫండులోంచి పాతిక వేలు కావాలి!... మా అమ్మాయికి పెళ్ళికుదిరింది సార్!'– చెప్పాడు.

'వెరీగుడ్! అబ్బాయి ఉద్యోగం చేస్తున్నాడా?'

'ఇంకాలేదుసార్! మెడిసిన్ చదివాడు!'

'గుడ్! అయితే కట్నం ఎక్కువే అయ్యుండాలి!'

'తప్పదుగదండీ! యాభై వేలు అడిగారు... ఆమధ్య మాఊళ్ళో, పొలం అమ్మిన డబ్బు ఓ ముప్పయ్‌వేలున్నాయి. అందుకే ఇంకో పాతిక లోన్ తీసుకుంటే— ఆ శుభకార్యం కాస్తా అయిందనిపించే యచ్చు!'

'వాళ్ళకి ఆస్తిపాస్తులు బాగావున్నాయా?'— ఆఫీసరు ప్రశ్నించాడు మళ్ళీ.

'ఫరవాలేదులెండి! అబ్బాయి తండ్రికి ఏలూర్లో పెద్ద మేడవుంది. 'సీతారామా టెక్స్ టైల్స్' అని పెద్ద బట్టలకొట్టు కూడా వుంది!'

'ఐసీ! అంటే మా సీతారామయ్యగారి అబ్బాయేనన్నమాట!'— ఉత్సాహంగా అడిగాడు ఆఫీసరు.

'అంటే...?' ఆయన మీకు తెలుసా సార్?'— కుతూహలంగా అడిగాడు వామన్రావ్.

'భలేవాడివే! తెలీకపోవటం ఏమిటి? మాకు దూరపు బంధువు కూడా!.... కష్టపడిపైకొచ్చిన మనిషి... ఇరవై ఏళ్ళక్రితం అతను రాజమండ్రీలో మా ఇంటిపక్కనే అద్దెకుండేవాడు!... చెబితే నమ్మవ్, అప్పట్లో బొంబాయినించి చీప్ వెరైటీ బట్టలుతెచ్చి— రోడ్లమీద బిజీగా వుండే సెంటర్లలో వేలం వేసేవాడు... వాటిమీద విపరీతంగా సంపాదించేవాడు... ఆ డబ్బుతోనే ఏలూర్లో స్థలంకొని, మేడకట్టాడు... ఏమైనా బతకనేర్చినవాడు!'

ఆఫీసరు చెప్పిన మాటలు వింటూంటే— కరెంటుషాక్ తిన్నట్టుగా అయిపోయాడు వామన్రావ్... ఇరవై ఏళ్ళక్రితం రాజమండ్రీలో అప్పరా

హోటల్ దగ్గర వేలంపాటలో- తాను చీరకొని ఎలా మోసపోయిందీ— సినిమా దృశ్యంలా కళ్ళముందు కదిలింది.

'కరెక్టే!... వాడేవీడు!'— అన్నాడు వేలం వేసిన వ్యక్తిరూపాన్ని మనసులోకి తెచ్చుకుంటూ...

'వేలం బుద్ధి ఎక్కడికి పోతుందీ?.... ఆనాడు బట్టల్ని వేలం వేశాడు. ఈనాడు కొడుకుని వేలం వేస్తున్నాడు. వేలం పాటను పెంచటానికి ఆరోజున ఎవరెవర్నో వాడుకున్నాడు... కట్నంరేటును పెంచటానికి ఈ రోజు ఆ శ్యామలరావుని వాడుకున్నాడు!'— అతని అంతరాత్మ ఉపదేశించింది...

ఆ ఊహరాగాలే అతనిలోవున్న రక్తం ఉడికిపోయి కళ్ళల్లోకి చిమ్ము'కొచ్చింది... నరాల్లోవున్న శక్తియావత్తూ పిడికిళ్ళకు చేరుకుంది.

ఏమిటయ్యా... అలా అయిపోయావేమిటి?'— అడిగాడు ఆఫీసరు.

'ఏం లేదుసార్... ఆ అప్లికేషన్ ఇచ్చేయండి!'— అంటూ ఆయన చేతిలోవున్న దరకాస్తును లాగేసుకున్నాడు...

'అదేం?' అర్ధంకాలేదు ఆఫీసరుకి.

'లోన్ అఖ్ఖర్లేదు... మా అమ్మాయికి ఈ సంబంధంచేయను!'- అంటూ ఆవేశంగా బయటకు నడిచాడు వామన్రావ్...

యువ

1985 దీపావళి